క్లుప్తంగా

కొత్త ప్రణాళికలతో నియోజకవర్గ అభివృద్ధి

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



దిల్‌సుఖ్‌నగర్: నూతన సంవత్సరంలో మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం కొత్త ప్రణాళికను రూపొందించుకుంటున్నామని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపడతామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిషలు కృషి చేస్తామన్నారు. పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చి డివిజన్లను అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలకు మంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలి

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ కార్యకర్తలకు సూచించారు. సెట్విన్ సంస్థ మాజీ చైర్మన్ మక్సూద్ అహ్మద్ అధ్యక్షతన శనివారం మలక్‌పేటలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలక్‌పేట నియోజకవర్గం బ్లాక్ కమిటీ, డివిజన్ కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా రెండవసారి నియమితులైన బొల్లు కిషన్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకృష్ణయాదవ్, బాబు శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, మహేష్, పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ రవీంద్రభారతి స్కూల్లో శనివారం న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జోనల్ డీన్ కె. జ్యోతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో...

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మలక్‌పేట మైత్రీ కమిటీ కన్వీనర్ లింగాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. శ్రీనివాస్‌గౌడ్ కమిటీ సభ్యులతో కలిసి ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అడ్మిన్ ఎస్సై సుభాష్, ఎస్సైలు జయంత్, సురేష్, నవీన్, నాయకులు నాగిరెడ్డి, సాయినాథ్‌రెడ్డి, దుష్యంత్‌కుమార్, పాషా, హన్మంత్ నాయక్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ....

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని పలు విద్యా సంస్థల్లో నూతన సంవత్సర వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హస్తినాపురంలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. రేస్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకలలో విద్యార్థులు డాన్స్‌లు, నృత్యాలతో అందరినీ అలరించారు. ఈ వేడుకల్లో రేస్ కళాశాల డైరెక్టర్ హరినిగిరిధర్, ప్రిన్సిపాల్ నిహారిక, అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమణి వారణాసి తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో కేసుల ఛేదన

- సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ
- తగ్గిన చైన్ స్నాచింగ్‌లు, ఇళ్లలో చోరీలు, హత్యలు
- పెరిగిన సైబర్ నేరాలు



నాగోలు: రాష్ట్రంలో అతి పెద్ద పోలీస్ స్టేషన్ అయిన ఎల్‌బీనగర్ స్టేషన్ పరిధిలో నేరాల సంఖ్యగతేడాది కంటే ఈ సంవత్సరం స్వల్పంగా పెరిగింది. 2021లో 1804 కేసులు నమోదు కాగా, ఈసారి 2039 కేసులు నమోదయ్యాయి. నేరాలను అదుపు చేసేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. కేసుల ఛేదనలో సీసీ కెమెరాల ఫుటేజీలను, అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ క్రైమ్ రేటును నియంత్రించారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం కేసులు కొద్దిగా పెరిగాయి. నేరాల సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల మంచి ఫలితాలు సాధించారని చెప్పుకోవచ్చు..నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించడం, గొడవలు జరిగితే నిస్పక్షపాతంగా బాధ్యులపై కేసులు నమోదు చేయడం, రోడ్డు ప్రమాదాలు జరగడం, పాత నేరస్తులు తిరిగి నేరాలకు పాల్పడకుండా వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం, అదృశ్యం కేసులు ఎక్కువగా నమోదు కావడం వల్ల ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగింది. చైన్‌స్నాచింగ్‌లు, తాళాలు పగులగొట్టి ఇళ్లలో దొంగతనాలు, హత్యలు, కిడ్నాప్‌లు తగ్గు ముఖం పట్టడం ఎల్‌బీనగర్ వాసుల్లో ధైర్యాన్ని నింపుతోంది.

- సైబర్ నేరాలు మాత్రం రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి..
- 2021 సంవత్సరంలో మొత్తం కేసులు 1804 నమోదు కాగా.. 2022లో 2039 కేసులు నమోదయ్యాయి..
- ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా కోసం సుమారు13412 కెమెరాలు ఏర్పాటు చేశారు.
- జియో ట్యాగింగ్ ద్వారా పాతనేరస్తులపై నిఘా ఉండడంతో పాటు సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం.
- ఎల్‌బీనగర్ చౌరస్తా నుంచి నిత్యం 800 పైచిలుకు బస్సులు దూర ప్రాంతాలకు వెళ్తుంటాయి. అక్కడ నుంచి విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. దీంతో అక్కడ చోరీలు, ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు మఫ్టీలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నేరాల సంఖ్య..	2021-	2022
హత్యలు	03 -	2
ఆత్మహత్యలు	72 -	35
మిస్సింగ్‌లు	262 -	254
దోపిడీ కేసులు	14 -	10
ఛేదించిన మిస్సింగ్ కేసులు	262 -	231
ఆస్తి నేరాలు	126 -	189
రోడ్డు ప్రమాదాలు	197 -	227
రోడ్డు ప్రమాదంలో మృతి	21 -	27
ఛీటింగ్ కేసులు	188 -	256
గొడవలు	216 -	198
కిడ్నాప్‌లు	23 -	26
లైంగిక దాడులు	31 -	42
ఫోక్సోయాక్ట్ కేసులు	40 -	39
పీడీ యాక్ట్ కేసులు	26 -	14
చైన్ స్నాచింగ్‌లు	04 -	06
దొంగతనాలు	220 -	305
ఎక్సైజ్ కేసులు	11 -	10
మొత్తం కేసులు	1804 -	2039
ఈ -పెట్టీ కేసులు	10930 -	8034

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సాయంతో నేరాల నియంత్రిచడానికి కృషి చేస్తున్నాం. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు ప్రజల భాగస్వామ్యంతో 13412 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. చిన్న తగాదాల విషయంలో ఈ –పెట్టీ కేసులు నమోదు చేస్తున్నాం. నేరాల నిగ్గు తేల్చడానికి ప్రత్యేక ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నాం. –అంజిరెడ్డి, ఎల్‌బీనగర్ సీఐ

సచివాలయనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ



అధ్యక్షుడు కూర్మారావు, ఇతర కార్యవర్గ సభ్యులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయనగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి బాబూరావు నూతన కమిటీని ప్రకటించారు. కాలనీ అధ్యక్షుడిగా కూర్మారావు, ఉపాధ్యక్షుడిగా సాంబశివరావు, ఆలేటి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా హన్మంతరావు, కోశాధికారిగా గోపాల్‌రెడ్డి, కార్యదర్శిగా సూర్యనారాయణ, క్రీడల కార్యదర్శిగా శ్రీధర్, సాంస్కృతిక కార్యదర్శిగా బాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులు, రవికుమార్, నర్సింహారెడ్డి, జనార్ధన్‌రావు, సీతారామరెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్షుడు కూర్మారావు మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం: ముద్దగౌని

ఎల్‌బీనగర్: రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణాలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ ఎల్‌బీ నగర్ ఇన్‌చార్జ్ ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ అన్నారు. వనస్థలిపురం మడేలయ్య స్వామి రజక అభివృద్ధి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు శనివారం రామ్మోహన్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వి.బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశధికారి నరసింహ, సభ్యులు అంజయ్య, యాదగిరి, శేఖర్.చిన్న, సాయి పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న రామ్మోహన్‌గౌడ్

దివ్యాంగుల దినోత్సవం

మలక్‌పేట: మహిళ వికలాంగుల సాధికారత సంఘం ఆధ్వర్యంలో శనివారం ఈస్ట్ ప్రశాంత్ నగర్‌లోని గవర్నమెంట్ హోమ్ ఫర్ ది ఏజ్డ్ అండ్ డిజేబుల్ ఉమెన్స్‌లో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు.కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు.ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, డాక్టర్ శ్రీదేవి, ఊర్మిళ, సరస్వతి, సనా పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌లో అందరూ భాగస్వాములు కావాలి

లింగోజిగూడ: ఆరోగ్యకరమైన భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని ప్రారంభించారని, ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీలోని మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించి స్వచ్ఛ ఎల్బీనగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, పరిశుభ్రమైన ఎల్‌బీనగర్‌ను తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రమేష్ గౌడ్ 2వ వర్ధంతిలో పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాస్కర్, కృష్ణంరాజు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, పవన్, రాజేష్‌గౌడ్, స్వయం ప్రకాష్, సూర్య ప్రకాష్, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్‌బీనగర్: బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను కేసీఆర్ ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల పరిధిలోని 191 మంది కల్యాణలక్ష్మి లబ్దిదారులకు శనివారం తన కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, యెగ్గే మల్లేశంలతో కలిసి సుధీర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓలు జయశ్రీ, శంశుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ నాయకుల పరామర్శ

చంపాపేట: పోలీస్ ఉద్యోగాల ఎంపికలో అవకతవకలపై శనివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమంలో పోలీసుల లాఠీ దెబ్బలకు గాయపడ్డ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ నేతలు పరామర్శించారు. ఈదీబజారుకు చెందిన పవన్‌కుమార్, రాహుల్‌గాంధీలకు గాయాలు కావడంతో పార్టీ నాయకులు వారిని చంపాపేటలోని అంకిత ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిని డివిజన్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి, నాయకులు శివసేనరెడ్డి పరామర్శించి భరోసా కల్పించారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

హయత్‌నగర్: అన్మగల్ హయత్‌నగర్‌లోని సర్వే నెంబర్ 191లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకొని రోడ్డు నిర్మిస్తున్నారని, దీనిని అడ్డుకుని ప్రభుత్వ భూమిని రక్షించాలని సీపీఐ నాయకులు శనివారం హయత్‌నగర్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి మాట్లాడుతూ... 1.9 ఎకరాల ఈ భూమి గతంలో కబ్జాకు గురైతే సీపీఐ చొరవతో అధికారులు స్వాధీనం చేసుకొని ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారన్నారు. ఆక్రమణదారులు ఆ ఫెన్సింగ్‌ను తొలగించి ఆ భూమిలో రోడ్డును నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఫెన్సింగ్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకొని భూమిని కాపాడటంతో పాటు ప్రజాప్రయోజనాలకు దానిని వినియోగించాలని కోరారు.

ఘనంగా తిరుమల బ్యాంక్ రజతోత్సవం



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

చాదర్‌ఘాట్: ప్రశాంతమైన మనస్సుతో దైవదర్శనం చేసుకోవాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మలక్‌పేటలోని తిరుమల బ్యాంక్ రజతోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంక్ కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దైవానికి దగ్గర కావాలంటే మనిషి ఆధ్యాత్మిక భావన పెంచుకోవాలన్నారు. తిమ్మాపూర్‌లోని తిరుమల తిరుపతి దేవాలయం ఈ నెల 26న బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, సీఈఓలు రాజారావు, శోభనాద్రి, మేనేజర్ రవిశంకర్ పాల్గొన్నారు.

దేవుళ్లను అవమానించిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేయండి

హస్తినాపురం: హిందూ దేవుళ్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సమాజం అధ్యక్షుడు బైరి నరేశ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని అయ్యప్ప స్వాములు శనివారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలో జరిగిన సభలో అయ్యప్ప స్వామి గురించి అతను అభ్యంతరకరంగా మాట్లాడాడని, అతడిని అరెస్టు చేసి పీడీ యాక్ట్ నమోదు చేయాలని సీఐ సత్యనారాయణకు వారు వినతి పత్రం అందజేశారు.

- **లింగోజిగూడ:** అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- **మన్సూరాబాద్:** హిందూ దేవుళ్ల పట్ల అవమానకరంగా మాట్లాడిన బైరి నరేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని మన్సూరాబాద్, నాగోలు కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణలు డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ అయ్యప్ప ఆలయం నుంచి ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ వరకు అయ్యప్ స్వాములు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు హాజరై సంఘీభావం తెలిపారు.
- **సైదాబాద్:** దేవుళ్లను అవమానిస్తూ మాట్లాడిన నరేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని సైదాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాసరెడ్డి గురుస్వామి పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు ఆయన పలువురు స్వాములతో కలిసి శనివారం సైదాబాద్ పీఎస్ ఎదుట నిరసన తెలిపారు.

'అవంతి'లో ట్రెడిషనల్ డే వేడుకలు

మలక్‌పేట: యాంత్రిక శక్తిపై ఎక్కువగా ఆధారపడటం వలన మానవ మేధస్సుకు పదును తగ్గిపోతుందని రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ నిత్యానందరావు అన్నారు. మూసారంబాగ్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం 'పరంపర-2022' పేరుతో నిర్వహించిన ట్రెడిషనల్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, సాంప్రదాయం అంటే పాతది కాదని, అది భవిష్యత్ దశ, దిశను చూపిస్తుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల పండుగల వేషాధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఎంబీఏ హెచ్ఓడీ డాక్టర్ రేణుక, ఎంసీఏ హెచ్ఓడీ నవీన్, కాలేజ్ ఇన్‌చార్జి మోహన్‌రావు, అధ్యాపకులు, పాల్గొన్నారు.